# శ్రీ నీలకంఠేశ్వర శతకము



రచన: మద్దాలి శ్రీనివాస్

# అంకితము

ఈ చిరు కానుక నా తిరుపతి తిరుమల పై నెలకొని యున్న శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితం చేస్తున్నాను.

.

విధేయుడు మద్దాలి శ్రీనివాస్(రచయత) 31/12/2014

పంతంబెందుకు బూనితోయి గరుణా బాంధవ్యమున్ గోరుచున్

చింతాక్రాంతము మానసంబు నిదిగో శ్రీ పాద యుగ్మంబులన్

చింతింపంగను నీపరంబుగను నే జేయంగ నెంతున్ దొరా

చింతల్ మ్రాంపగ జేయుమా మనసునన్ శ్రీ నీలకంఠేశ్వరా! (1)

విత్తంబొక్కటె మూలమిద్ధరణినిన్ విత్తంబె సర్వంబనన్

విత్తంబిచ్చునె వేద విద్య లెరుగన్ విజ్ఞాన సంపత్తులన్

విత్తంబిచ్చునె సద్గతుల్ తలపగన్ ;విత్తంబు సొత్తవ్వదే

చిత్తంబీశ్వరుఁ బాదమందు నిలుపన్ శ్రీనీలకంఠేశ్వరా (2)

నీలగ్రీవము వ్యోమకేశములతో నిండైన గంగమ్మతో

బాలప్రాయపు చంద్రవంక మకుటంబై కాంతులీనంగ ముం-

గేలన్ శూలము బట్టు మూర్తి యెవరో గీర్తింతు నే వానినిన్

శ్రీలక్ష్మీ రమణాంతరంగ నిలయా శ్రీ నీలకంఠేశ్వరా! (3)

సర్వంబంతయు నీదు పాద రజమే సర్వాత్మకా,శాశ్వతా

నిర్వాణంబును గోరి జేయ తపమున్ నిర్మోహ బుద్ధిన్ సదా

గర్వంబంతయు మాయమౌను మదిలో గౌరీపతిన్ నిల్ప, నా

శీర్వాదంబదె మోక్ష గామికెపుడున్ శ్రీనీలకంఠేశ్వరా! (4)

ఇందుప్రోలున సుందరాంగు మహిమన్నే నెంత గీర్తింపగా

నెందైనన్ గనిపించు వాడె జగతిన్నింపార దర్శింపగన్

పొందెన్ బుర్వియు దిన్నడప్పుడెటులన్ భోగీంద్రుడున్ హస్తియున్

చెందంగా నిను నాదు మార్గమదియే శ్రీ నీలకంఠేశ్వరా (5)

మందారంబులు బిల్వపత్రములతో మందాకినీ తోయముల్

సందోహంబుగ బోయనీదు తలపై శాంతస్వరూపుండపై

అందంబింపుగ పెంపునొంద గనెదన్నానందమున్ పొందుచున్

చిందేయంగను నాదు డెందమెలమిన్ శ్రీ నీలకంఠేశ్వరా (6)

శుద్ధస్ఫాటిక భాస్వరద్యుతులతో శోభిల్లు నీ రూపమున్
ఇద్ధంబైనగుపించగాను గనులన్వీక్షించెదన్ దేవరా
శుద్ధాంతః కరణంబు నీయ దయతో సోమేశ్వరుండీయెడన్
సిద్ధంబయ్యెద నిన్ను జూడనెపుడున్ శ్రీ నీలకంఠేశ్వరా (7)

రుద్రుండాతడు లోక శోక భయ హర్తుండాతనిన్ గొల్తు నిర్
నిద్రుండంతకుడంతమొందగను తానే గారణంబయ్యె తా
బద్రంబీయగ గొల్వు దీర నభయంబాశించుటేలన్ సదా
చిద్రూపంబున దక్షిణాశ్యునరయన్ శ్రీ నీలకంఠేశ్వరా! (8)

కాయంబంతయు గాయమాయె నెపుడో గర్మంబులన్ జిక్కగన్
ప్రాయంబంతయు నీరుగారె నిపుడున్ ప్రాప్తించ దుఃఖంబులున్
సాయంబెవ్వరు నీవుదక్క నిపుడున్ సంసారమున్ దాటగన్
శ్రేయంబింకను నీదు సేవలవియే శ్రీ నీలకంఠేశ్వరా (9)

పొగడంగా వశమౌనె నిన్నుఁ బదముల్ పొందించిఁ బద్యంబులన్
తగురీతిన్ రచియింపఁ నాకు తరమే తప్పున్న మన్నింపవే
నగుబాటుల్ బడనీక నీ పదములన్ నాకింత చోటిమ్ము నీ
సిగపై చంద్రుని నుంచినావుగద యో శ్రీ నీలకంఠేశ్వరా! (10)

నారున్ నీరును నాకు నీవె నిరతానందంబు నీవీయ నీ
బేరున్ జెప్పుచు నొందితిన్ సుఫలముల్ బేర్కొందు నిన్నేతరిన్
తీరంబున్ గని తెప్ప గాల్చుగొనగన్ తిక్కొదునో వెర్రినో?
జేరంగా నిను భక్తి దల్తు నెపుడున్ శ్రీ నీలకంఠేశ్వరా! (11)

బొమ్మన్ జేసెడి బమ్మ నెట్టు లుసురున్ బోయంగ నర్థించుటో?
గొమ్మన్ బుట్టిన పువ్వు నెవ్వరెటులన్ గోరంగ బుష్పించునో?
గ్రమ్మన్ భక్తియు జేర్చు నెప్పు డదియే గైవల్య మందాకినిన్
జిమ్మన్ గాంతులు జీకటుల్ చెదరవే శ్రీ నీలకంఠేశ్వరా! (12)

క్షీరంబున్ గొని నీరు వీడునదియే శీలంబు రాయంచకున్
జేరంగన్ సతతంబు సద్గుణములున్ జేయున్ శుభంబెప్పుడున్
ద్వారంబౌనది ముక్తి సౌధమునకున్ దగ్ధంబగున్ శోకమున్
శ్రీ రామార్చిత పాద సేవ గలుగన్ శ్రీ నీలకంఠేశ్వరా (13)

చిత్రంబౌ పలు వేష భూషణములున్ జిత్రంబు నీ రూపమున్

చిత్రింపన్ దగునెట్టి చిత్రకునకున్ జిత్రంబులౌ నాగముల్

చిత్రంబౌ నిను కృత్తి వాస గనెదన్ చిత్తంబునన్ నీ దయన్

చిత్రంబౌ శశి సూర్య వహ్ని నయనా శ్రీ నీలకంఠేశ్వరా (14)

నీవో కొండవు రెమ్మలేని తరుపై నీకాంత తానుండగన్

నీవో కొమ్మయు లేని చెట్టుని గనన్ నీ చిత్ర సంసారమున్

గావన్ మమ్ము మహాశ్మశానమునను‌న్ గాంతారమున్ గొల్వులా

శ్రీ విశ్వేశ్వర భక్త చిత్త నిలయా శ్రీ నీలకంఠేశ్వరా! (15)

సగ భాగంబున వెండి కొండ మెరుపుల్,సంద్రంపు నీలంబులున్

సగ భాగంబున, భీమ రూపమదియున్ సౌందర్యముండంగ నో

సగమై యిర్వురు నొక్క దేహముగనున్ సాక్షాత్కరింపంగ జూ

సి గదా నివ్వెర బోతి నబ్బురమునన్ శ్రీ నీలకంఠేశ్వరా! (16)

మిత్రత్వంబున కంఠ సీమ నొరయన్ మిన్నైన నాగంబులున్

జిత్రంబౌ విష నీలిమల్ గళమునన్ సింగారమై నిల్చినన్

జిత్ర ప్రాకృత రుండమాల నదియున్ చిత్రంబుగా దోచినన్

చిత్రంబౌనవి నీదు లీలలవియున్ శ్రీ నీలకంఠేశ్వరా! (17)

శ్రీ లక్ష్మీ విభు డిష్టమొందగను శ్రీ చిహ్నాంబులేమున్నవో
నీలంబౌ గళ సీమనందు విషమే ?! నీ భస్మ మైశ్వర్యమే ?!
చాలింకన్ గణుతింప నీదు గుణముల్ శక్యుండనే నేను తం
డ్రీ! లక్ష్మీ రమణాంతరంగ వినుతా శ్రీ నీలకంఠేశ్వరా! (18)

తనువున్ డస్సెను మానసంబునలసెన్ తాపంబులన్ జిక్కుచున్
మును నా పాపము పండినేడు నను నిర్మూలంబు గావింపగన్
నిను నే మర్చిన గాని నన్ను మరువన్ నీకౌనె పాపాంబు రా
శిని దాటంగ లలాట నేత్ర తగనో శ్రీ నీలకంఠేశ్వరా! (19)

ముక్కంటీ! కని కన్నులందు రుధిరమ్మూరంగ గన్నప్ప తా
నిక్కంబౌ నొక భక్తి తోడ గనులన్ నీకప్ప జెప్పెన్ గదా
దిక్కున్ గానక నీదు పాదములనే దిక్కంచు వాపోవు నా
చిక్కున్ దీర్చవు భక్తి లేమి వలనే శ్రీ నీలకంఠేశ్వరా! (20)

వీక్షింపన్ సుమనోహరంబునగు నీ వేదస్వరూపంబు నే
వీక్షింపన్ దగువాడగాన నయినన్ విశ్వేశ్వరుండైన నిన్
వీక్షింపంగను నెంతుఁ మూర్ఖుడను నన్ భీతావహున్ జేయకన్
శిక్షింపంగను నెంచకన్ దయగనో శ్రీ నీలకంఠేశ్వరా! (21)

వలపుల్ బుట్టగ ,పుష్ప బాణములఁ రువ్వన్ తాను భస్మంబయెన్
వలరాయండట; దక్షుఁ గర్వమును దావాగ్నిన్ నశించెన్ గదా
విలయాగ్నిన్ బ్రభవింప జేసి జగమున్ విభ్రాంతిలో ముంచగా
చెలగన్ తాండవ కేళి నోపఁదరమే శ్రీ నీలకంఠేశ్వరా! (22)

రక్షా దక్షుని వీక్షణంబులవియే రక్షించు లోకంబులన్
సుక్షేత్రంబన లేక్షు మందిరమునై శోభిల్లు నీక్ష్మాస్థలిన్
నిక్షేపంబన లక్షబిల్వములతో నిన్నర్చనల్ జేయుటే
శిక్షా దక్షుడ నీవె రక్ష యనుదున్ శ్రీ నీలకంఠేశ్వరా! (23)

గంగమ్మన్ గొని గొప్పనందు నణచన్, గాండీవి కోదండమున్
భంగింపన్ బహు నేర్పులన్ బరగునిన్ భావించుచున్ దివ్యమౌ
నంగాంగంబుల లాస్యకేళి మునుగన్నానందముప్పొంగగన్
శృంగారాకృతి వెల్గు చుండ గనెదన్ శ్రీ నీలకంఠేశ్వరా! (24)

భిక్షన్ గైకొన సర్వపాప హరణంబే గారణంబౌను నీ
కుక్షిన్ నింపుకొనంగ గాదు గనినన్ గోత్రాత్మజన్ గూడు నీ
కే, క్షామంబది గల్గునే మొరకుఁ నాకీ బోధ జేయంగ నీ
శిక్షన్ బొందగ జేతువయ్య కరుణన్ శ్రీ నీలకంఠేశ్వరా! (25)

కయ్యంబున్ గొనిఃబోరలేను పగతో: కాయంబునర్పింపలే
నయ్యానీకును పొత్రమందుః, చనులన్ నాకెందుః గాన్ పట్టవే
కొయ్యందున్ నినుః జూడః నా తరము గాకుండయ్యరో నాకు నీ
చెయ్యందింపగ గోరుదేను వినుమా శ్రీ నీలకంఠేశ్వరా! (26)

పద్యంబల్లను బాటి గాను బలుకన్ భావంబులన్ నిండుగన్
హృద్యంబౌ నొక గానమున్ నుడువ నిన్ హృద్యంబుగా దల్చుచున్
విద్యా మూర్తి కృపావలోకనమునన్ విద్యల్ గుభాళించు నా
సేద్యంబిప్పుడుః జేతు నీదు కృపతో శ్రీ నీలకంఠేశ్వరా! (27)

కొలువన్ బోతిని కాలనాగునొకనిన్ కొండంత మోహంబుతో
నిలువన్ జాలక నిప్పుడేను విషమున్ నీ పాదముల్ జేరితిన్
బలుచన్ జేయకు మయ్య నన్ను మును నా బాపంబులన్ దల్చకే
సెలవీయంగః దలంతువోగరుణతో శ్రీ నీలకంఠేశ్వరా (28)

మోహంబయ్యది మోసగించునపుడున్ మోదంబు గోల్పోయినన్
దేహంబంతయు నీరసించినపుడున్ దీనాతి దీనంబుగన్
దాహంబొక్కటి బెంపునొంది పడగల్ తాటించినన్ నాకు నీ
స్నేహంబొక్కటె రక్ష నీయునెపుడున్ శ్రీ నీలకంఠేశ్వరా! (29)

నిను పూజింతును నీదు దివ్య చరితన్ నీలీలలన్ దల్చుదున్
విని నీగాధలు మేను మర్చెదను నిన్ వీక్షింప నా డెందమే
కనుపాపైనది; పాపరాయ! కవితాగంధంబు బూయంగ జే
సిన బుణ్యంబొకటేది? నీదు దయయే శ్రీ నీలకంఠేశ్వరా! (30)

అపరాధంబులనెన్ని జేసితిని నాయందున్న దోషంబులున్
విపరీతంబగు బుద్ధియున్ చెలగ౹ సద్విద్యా విహీనుండనై
నిపుణత్వంబును లేక గర్వితుడనై నీల్గంగ జేయుంగదా
రిపుషట్కంబది! గెల్వనేర్తునెటులన్ శ్రీ నీలకంఠేశ్వరా!(31)

కామింపంగను కామకోటి తుదియౌ కామేశ్వరున్ గోరినన్
కామింపంగను నేమియుండు జగమున్ గామింపగా నాడు నిన్
బాముున్ సామజమున్ శిలంది యదియున్ బ్రాప్తింపగా మోక్షమున్
క్షేమంబన్నను నీదు సన్నిధిగదా శ్రీ నీలకంఠేశ్వరా (32)

స్మరునిన్ గెల్చిన దాపసిన్ దలప తన్మాహాత్మ్యమున్ లీలలన్
గరుణా రూపము ధ్యానమున్ నిలుపగన్ గైవల్య భాగ్యంబులే
సరణిన్ గల్గవు?!; ముక్తి గాములకు నిస్సారంబు సంసారముల్
సిరులన్నన్ శివు౹బాద సేవలవియే శ్రీ నీలకంఠేశ్వరా! (33)

కాలంబంతయు గామ కేళి మునుగన్ కాళుండు బిల్వంగ నా
జాలంబందున జిక్కి నీల్గి జనుచున్ జాలింతు రీజన్మమున్
మేలింత్తైనను జేయ నోపరెటులో!; మీ పాద సాంగత్యమే
శీలంబైనను వారె బుణ్య మతులౌ శ్రీ నీలకంఠేశ్వరా (34)

నందిన్ పందిగ జేయు లోకమున నీ నామంబులన్ రూపమున్
నిందింపంగను వెఱ్వ రయ్య శివ నిన్ నిందింప నే గీర్తులన్
బొందంగన్ మది దల్తురేమి గలుగున్; బుద్ధుల్ నశింపంగ నిన్
జెందంగన్ గలుగెన్ని జన్మలకు నో శ్రీ నీలకంఠేశ్వరా! (35)

నీ చింతన్ మునుగంగ, గంగ జలమున్నే బుణ్యమాశించుదున్
ప్రాచీనంబగు నాదిః నీవె తుదియున్ బ్రాప్తించు దీపైన నే
నే చింతన్ బడి బాధ నేల బడుదున్ నీ నామమే జాలు పే
రే చింతా మణులేల నయ్య గనినన్ శ్రీ నీలకంఠేశ్వరా! (36)

మునుగంగన్ శివ లీలలందు మునుగన్ మున్నీటినందున్ మనం
బునగానన్ మరి తీర్ధరాజములనే పొద్దున్ వినంగాను నే
ననుకూలంబగు నామ మొక్కటదియున్ నా మానసంబందుని
ల్చిన నీనామమె తీర్ధమై బరుగునో శ్రీ నీలకంఠేశ్వరా! (37)

శంకన్ బొందిన శంకరున్ గరుణతో సంస్కారునిన్ జేయ నా
వంకన్ దాను మనీష పంచకమునే వాక్శుద్ధి తో బల్కగన్
గ్రుంకుల్లేకను పొంగు లేక నెపుడున్ గ్రోధాదులన్ ద్రుంపగా
జింకన్ దాల్చిన నీకెనౌను హరటం శ్రీ నీలకంఠేశ్వరా! (38)

మత్తేభాజిన మంబరంబు నమరన్ మందాకినీ శేఖరా
హత్తింపన్ ఘన భస్మ రాశులొడలన్ హారంబు నాగంబుగా
దుత్తౌ మస్తకంబు నీదు కరమున్ దోరంపు రూపంబునన్
జిత్తంబుబ్బగ జూడగల్గుదెపుడున్ శ్రీ నీలకంఠేశ్వరా! (39)

చూడంగోరుచు సూకరాకృతిని దా జొర్రంగ పాతాళమున్
జూడాంగా నిను హంసవాహనుడు దా జొర్రంగ నాకాశమున్
జూడంగల్గిరె నిన్ను వారలపుడున్ జూడంగ నీ రూపమున్
జీడల్ద్రొల్గిన భక్తి గల్గు నెపుడున్ శ్రీ నీలకంఠేశ్వరా! (40)

బుద్ధిభ్రంశము చేత చంచలగతిన్ బోవంగ నిన్ జూడ నే
శుద్ధిన్ బొందక నిట్లు వంచితుడనై శోధింప సత్యంబు నే
నెద్దానిన్ శరణంబు వేడుదును నిన్నే గోరెదన్నే గతిన్
సిద్ధిన్ గల్గను జేతువయ్య ఘనుడా ! శ్రీ నీలకంఠేశ్వరా! (41)

సత్సాంగత్యము‹ జేసి సత్యమరయన్ సంస్కారమే లేని నా
మాత్సర్యంబును‹బార‹ ద్రోలగను సేమంబౌ పదాబ్జంబులన్
వాత్సల్యంబున నీవె నాకు నొసగన్, వాంచింతు‹నీ ప్రేమ,నా
చిత్సామ్రాజ్యము నేలుకోవె దయతో శ్రీ నీలకంఠేశ్వరా! (42)

నానానాద వినోద కేళి నిరతున్ నాదాత్మకున్ నాదమే
తానౌనా ప్రణవస్వరూపునసిశున్ దాదాత్మ్యతల్లీనత
న్నానందామృత వాహినిన్ మునిగిసే నానందమై సాగెదన్
శ్రీ నాథా కరుణా రసామృతకరా శ్రీ నీలకంఠేశ్వరా! (43)

నిత్యానిత్యము లెంచ గాను నెరుకన్ నేనొంద గాలేను నిన్
సత్యంబందును నీవె నిత్యమనుదున్ సాక్షాత్కరింపంగ నిన్
నిత్యంబేను దలంతునయ్య నిధియౌ నీ సన్నిధిన్ గోరుదున్
చేత్యంబౌ నొక సత్యమీవె జగతిన్ శ్రీ నీలకంఠేశ్వరా! (44)

దాసోహంబని నీదు పాదములనే దాకంగ గంగాధరా
వీసంబంత నుపేక్ష జేయక కృపన్ వీక్షింతువే సత్యమౌ
నీ సాంగత్యము నీయ నెంతువుగదా నీ దృక్కులన్ ధన్యుడన్
జేసేవీవు సదా దయా మయునిపై శ్రీ నీలకంఠేశ్వరా! (45)

అంగారాక్షము సర్ప హారము విషాహారంబు నీకేతగున్
అంగాంగంబున భస్మ రాగ మదియున్నాయంబికా మాత నీ
యంగార్ధంబుగ నుండ నీదు తలపై యాగంగ గొల్వుండ నీ
సింగారంబును జెప్ప నాకు దరమే శ్రీ నీలకంఠేశ్వరా! (46)

డమరుధ్వానము మ్రోగ తాండవము లాడంగన్ గణేశాదులున్
ప్రమథుల్ గౌరియు నాట్యమాడి శివుతోఁబాడంగ నాకిన్నెరుల్
గమకంబుల్ లయలింపునొందగను నాగాధీశులాడంగ , జూ
సి మహానందము నొందుదేను మనమున్ శ్రీ నీలకంఠేశ్వరా! (47)

ఆప్తుండెవ్వరు లోకమందు శివ నిన్నాప్తుండుగన్ జేసియున్
బ్రాప్తాప్రాప్తములన్ని నీదు దయగా భావించి సేవించుచున్
తృప్తిన్ జీవితమున్ శివాశ్రయముగా తృప్తాస్థ సద్భక్తి ని
క్షిప్తింపంగను నిన్నె జేరు ఘనుడే శ్రీ నీలకంఠేశ్వరా ! (48)

బహురూపంబులు నామముల్ బరగు నిన్ బ్రార్థించుటన్ జూచుటన్
బహుకష్టంబగు నొక్క రూపమున నిన్ భావింపగన్ జూడగన్
బహుప్రీతిన్ బలుకంగ నామమొకటిన్ భక్తిన్ దలంపంగ మీ
రిహమందే శుభమీయరే దలపగన్ శ్రీ నీలకంఠేశ్వరా! (49)

ధనదుండాప్తుడు విష్ణువర్చకుడునౌ దాలక్ష్మి తోబుట్టువౌ
ఘనమౌ నీ చరితంబులన్ సురులు నాగంబుల్ నరుల్ యక్షులున్
గనుచున్ బాడుచు నుండు వైభవములన్ గౌరీశ నేమందు నే
చినవాడన్ దయ తోడ నన్ను గనుమా శ్రీ నీలకంఠేశ్వరా! (50)

క్రీడిన్ బోరున హత్తు గొంచు తనువున్ గీలింపనుద్దండతన్
బాడిన్ శస్త్రములస్త్రముల్ వరములీ బంపంగ నా పుణ్యముల్
నాడా క్రీడి తపః ఫలంబులగునో నాడే దయన్ జూచితొ?
క్రీడాసక్తియు నీదు లీలయెగదా శ్రీ నీలకంఠేశ్వరా! (51)

విజ్ఞానంబుల నీయు మాకు గురుపై విద్యా వివేకంబులున్
ప్రజ్ఞానంబను పండ్ల నీయ తరుపై పాపంబులన్ ద్రుంచ గా
అజ్ఞానంబను జీకటిన్ దొలగజేయన్, జ్ఞాన దీపంబుపై
శ్రీ జ్ఞానాంబిక తోడుగా వెలుగవో శ్రీ నీలకంఠేశ్వరా! (52)

దేహంబన్నను నీదు గేహమటనో దేవేశ తా బుద్ధి నీ
దేహార్ధంబగు గౌరి దాము ప్రమధుల్ దేహాంగముల్ నీకు నీ
వే హారంబుగ లోకముల్ మణులునై వెల్గంగ నీవాత్మపై
స్నేహంబున్ గొని మమ్ము బొందుదువయా శ్రీ నీలకంఠేశ్వరా! (53)

నీవే నేనను భావమే మధురమౌ, నీయెత్తు నేనౌదునే ?
నీ వైరాగ్యము, జ్ఞాన చింతనయు, నేనే రీతి, బొందెదన్?
నీ వాత్సల్యము, నీదు ధ్యాన నిరతిన్ నేనొంద నేఁబాటినే?
శ్రీ వైకుంఠుఁడె, బాటి నీవగుటకున్ శ్రీ నీలకంఠేశ్వరా! (54)

క్రూరవ్యాళము కంఠ హారమగుటన్ గ్రోధాదులన్ గెల్చుటే
క్రూరంబౌ కరి రాక్షసున్ దునుమినన్ ఘోరాసురున్ గోర్కెఁ దా
నా రాకాసుని తోలు గప్పు గొనినా నందంబు గానెంచెనో
శ్రీ రుద్రా యన రోదనల్ తొలగవే శ్రీ నీలకంఠేశ్వరా! (55)

జటిలంబౌ సుర గంగఁ దర్పమతినా ఝుంఝూభ్ర శుభ్రన్ జటన్
బటుశక్తిన్ గడు వేడ్కతోడ నణచన్ బ్రహ్మాండ వేగంబునన్
చటులంబౌ నది పాపనాశనిగనై జన్మంబు ధన్యంబయెన్
చిటికంతైనను దాక నిన్ను దగనే శ్రీ నీలకంఠేశ్వరా! (56)

శివమే విశ్వము నంతనిండు శివమే శ్రీ భావమయ్యుండు నా
శివుడే నాత్మయు నాతడేను పరమాత్మా నాతడే నాదియున్
శివుడే నంతమునందు నుండు నొకడై సేవింపగా నాతనిన్
శివమై జీవితమంత సాగు ననెదన్ శ్రీ నీలకంఠేశ్వరా! (57)

శివతత్వంబది చిత్రమౌను దలపన్ శ్రీలిచ్చు చింతామణుల్
భవునిన్ దీరుగ జూచినంత కలుగున్ బంధుత్వమున్ బ్రేమయున్
శివునిన్ గూడియు నుండు నంబ దయలే శీలంబుగానొప్పుచున్
శివుడే చిత్తము నుండ గల్గు శుభముల్ శ్రీ నీలకంఠేశ్వరా! (58)

కవితా ప్రౌఢియు శాస్త్ర శేముషియుఁ నేగానంబులున్ నేను నే
రవయంత్రైనను నేర్వనయ్య నిను నో రాజేశ్వరా గీర్తనల్
స్తవముల్ జేయుట నౌనె నాకు తగనో స్తానంబు గోరంగ నో
శివ నీ భక్తుల తోడుతన్ దయగనో శ్రీ నీలకంఠేశ్వరా! (59)

పశువున్ పాశము జేత గట్టబడితిన్ బంధంబులన్ బాపి నీ
వశమున్ జేగొను నన్ను నీవె మది నిన్ బ్రార్థించెదన్ దేవరా
శిశురీతిన్ చరియించు నన్ను పితవై శీలంబులన్ జూడకన్
శిశువున్ బెంచెడి దండ్రి వై దయగనో శ్రీ నీలకంఠేశ్వరా! (60)

చిత్తంబియ్యది మర్కటంబు నెపుడున్ చీకాకు జేయంగ నీ
సొత్తుంజేసెద నయ్య దీని గుణముల్ చోద్యంబుగానుండు నన్
చిత్తున్ జేయుచు దారి దప్పగను జేసేనయ్య నీవే దగున్
చిత్తంబున్ సరి జేయగన్ పశుపతీ శ్రీ నీలకంఠేశ్వరా! (61)

తరుణీ యవ్వన సోయుగంబులవి చిత్తహ్లాద సంతృప్తులే
కరణిన్ జేయగనోపు చిత్తమున నిన్ గాంచంగ నాతృప్తి యే
సరణిన్ మేలగు నెంచి జూడగఁ సదా సంసార చక్రంబునన్
శిరసున్ వ్రయ్యలు జేయు మాయలెడలున్ శ్రీ నీలకంఠేశ్వరా! (62)

తారామండల నాయకుండు మును గాత్ర త్రాణ హీనుండయున్
నీ రక్షన్ గొని శీర్ష మున్ మకుటమై నిండైన కాంతుల్ సువి
స్తారంబై గురిపించె నెల్లెడన్ భవపదాబ్జ శ్రేణి సేవా రతిన్
క్షీరోదార్ణవ సూనుడున్ సిరిగొనెన్ శ్రీ నీలకంఠేశ్వరా! (63)

కరుణించెన్, ఘన శైలమున్ తరుణినా గౌరిన్ వివాహంబునన్
వరియింపన్, నగ పుత్రి నీ సగముగా, వాగర్థముల్ బోలికన్
గరుణింపన్ మము తల్లి దండ్రులుగ మాకందింపరే సౌఖ్యముల్,
సిరులన్, శాశ్వతమైన ముక్తి నొసగరే శ్రీ నీలకంఠేశ్వరా! (64)

నాకుక్షిన్ కొలువుండ గోర గలనే? నా గేహంబుకున్ రక్షగా
నా కొల్వున్ బని జేయ గోర గలనే ? నా పూర్వ పుణ్యంబునన్
నీ కొల్వున్ మురిపింప నెంతు మదిలో నీ పాదమంజీరమై
శ్రీ కైవల్యమె గాంక్ష నాకు వరదా శ్రీ నీలకంఠేశ్వరా! (65)

చాతుర్యంబున పద్యమింపున ననన్ సద్భక్తి తో నాదమున్
శ్రీ తూర్యా రవముల్ శుభంబొనర నిన్ చిత్తంబునన్ దల్చి యే
రీతిన్ సేవలు జేయనెంచినను వారే బంధువుల్ స్నేహితుల్
బ్రీతిన్ మానసమున్ దలంచు ఘనులౌ శ్రీ నీలకంఠేశ్వరా! (66)

మును శ్రీ కాంతుడు వామ భాగమయె నా మోదంబునన్ దేవరా
గొని తాఁ గౌరవ మొందెనంబికయు నిన్ గూడెంగ నర్ధాంగియై
వినగా నే రిపు షట్కమున్ గెలువ భావింతున్ మనంబందు మీ
రిన భక్తిన్ శివ శంకరా యనుచు నో శ్రీ నీలకంఠేశ్వరా! (67)

ఉన్మత్తుండని గేలి జేయ నిను నా యున్మత్తులన్ సైతమున్
సన్మానింతువు భక్తి తోడ గొలువన్ సన్మార్గమున్ జూపుచున్
తన్మాత్రల్ శశి సూర్య భూత చయమున్ దాక్షిణ్య మూర్తిత్వమై
చిన్ముద్రన్ పరమాత్మ తత్వ మెలయున్ శ్రీ నీలకంఠేశ్వరా! (68)

శ్రీ గౌరీ పతి నీదు పత్ని సతియున్ క్రీడించు నీ బిడ్డలున్
శ్రీ గౌరీశ! కుటుంబమన్న నిదియే ప్రేమాను బంధంబులిం
పౌ గౌరీ సతి తోడుగాను కడు సొంపౌ దృశ్యమున్ జూడగా
శ్రీ గౌరీశ!వరంబు నీయ మనెదన్ శ్రీ నీలకంఠేశ్వరా! (69)

శ్రీ గంధంబన భస్మ లేపనము సచ్చీలంబులే చేలముల్
శ్రీ గౌరీ విభు నామ కీర్తనములే చింతామణుల్ రత్నముల్
శ్రీ గౌరీశుని సేవ భాగ్యమనుచున్ చింతించు వారే సదా
శ్రీ గౌరీశ నిజాంతరంగ నిలయుల్ శ్రీ నీలకంఠేశ్వరా! (70)

త్రిపురున్ గూల్చిన నీదు లీల వినుచున్ తీరైన వీరత్వమున్

విపులంబౌ చరితంబులన్ చదువుచున్ విశ్వాసమున్ భక్తియున్

విపులంబై రుచులూర నా మనమునన్ వీక్షించి నీ లీలయే

రిపు షట్కంబును ద్రుంచు ఖడ్గ మనుదున్ శ్రీ నీలకంఠేశ్వరా! (71)

క్రాంతిన్ శాంతియు దాంతియున్ గలుగ వైరాగ్యంబు గల్గింప నా

భ్రాంతిన్ శోకములున్ విడంగ శరణంబందున్ సదాచార వి

క్రాంతిన్ నెలకొల్ప శంకరునిపై కర్మావనిన్ బుట్టవే

చింతింతున్ నిను జ్ఞానమార్గ నిధిగా శ్రీ నీలకంఠేశ్వరా! (72)

సుధలన్ ధారగ చంద్ర నేత్రమున నాశుంభచ్చటా చండ దీ

ప్తి ధరన్ వెల్గుగ నర్క నేత్రమున సుప్రీతిన్ బిసాళింప నా

విధి చాలింకను ఫాలనేత్ర శిఖలన్వీక్షింప నేలా ప్రభూ

శిథిల ప్రాయుల జేయకయ్య మములన్ శ్రీ నీలకంఠేశ్వరా (73)

వినగా,పాడగఁ జూడగా, దలపగా,వేరేమి యుండున్ ముదం

బొనరన్ సేవయు, దాస్యమున్,గడకునే పూజింపగా నర్పణం

బొనరింపంగను నాదు యాత్మ మిగులున్; పూర్వంపు కర్మంబు వే

సిన పాశంబులు వీడిపోవుఁ గదనో శ్రీ నీలకంఠేశ్వరా! (74)

అన్నింటన్ సెలవుండు మిమ్ము బిలువంగా సాధ్యమే దల్పగన్
మన్నింపంగను మమ్ము మీరు కరుణన్ మా యిచ్చలన్ దీర్తురే
మిన్నేపాటిది మిమ్ము బోల్చ ఘనతన్ మీసాటి మీరేను నా
చిన్నీరేరుహమున్ వరించి గొనుమా శ్రీ నీలకంఠేశ్వరా! ( 75)

ఎన్నెన్నో గుణ వైభవంబులను నే నెన్నో విశేషంబులన్
విన్నన్ గన్నను నిన్ను నే పదములన్ విన్నంత వర్ణింపగా
నెన్నేనీ సరి తూగవయ్య; మహిమానేకంబులన్ దల్ప వి
ఛ్ఛిన్నంబౌ పెను మాయ దల్చెద నెపుడున్ శ్రీ నీలకంఠేశ్వరా! (76)

చవులూరన్ గవి కుంజరంబు లవనిన్ చందో విశేషంబులన్
అవనీ నాథులు మెచ్చగాను చవులింపారంగ శోభాయ మా
న వచో వైభవ గర్భ కావ్యములు నానా రీతులన్ జేసియున్
శివలీలామృత ధార గ్రోలరకటా శ్రీ నీలకంఠేశ్వరా (77)

రవి చంద్రుల్ కనుదోయి మంగళము లారామంబులున్ సౌమ్యమౌ
కవి వాక్కుల్ గురు భాషణంబులవియున్ గానంగ నామంద హా
సవిలాసంబులు నాగ హారపు విలాసంబుల్ సుధామౌళి నే
త్రివిధుల్ కీర్తన చేయలేరు గనినన్ శ్రీ నీలకంఠేశ్వరా! (78)

నక్తంబున్నను దక్కవయ్య గనినన్ నాకాది లోకంబులున్
ముక్తింపొందగ నెందరీ యవనిన్ ముక్కంటి నిన్ దల్చినన్
భక్తిన్ దల్చు మృకండు సూనునకు నా భాగ్యంబు దక్కెన్ కదా
రిక్తంబౌ పలు యత్నముల్ వృధయె గా శ్రీ నీలకంఠేశ్వరా! (79)

ముద్రల్ జూపుచు ధ్యాన నిష్టలనుచున్ మోసంబులన్ జేయుచున్
నిద్రా సక్తులు,మాయనందు మునుగన్ నిన్నే గతిన్ బొందరే
ఛిద్రంబౌ సుఖశాంతు లన్ని గనినన్ చీకాకు లా యత్నముల్
చిద్రూపున్ గన నిండు భక్తి వలయున్ శ్రీ నీలకంఠేశ్వరా! (80)

జయమున్ గోరుచు కొందరున్ సుఖములన్ సంపత్తులన్ గోరుచున్
భయమున్ ద్రోలగ కొందరున్ పదవులన్ బ్రాప్తింప భోగంబులన్
రయమున్ బొందగ కొందరున్ నిరతమున్ బ్రార్థింతు రేగాని నిన్
ప్రియమున్ గైకొను వారలేరి పుడమిన్ శ్రీ నీలకంఠేశ్వరా! (81)

పొగమంచున్ చలి కొండలన్ వలిపమున్ పున్నాగమున్ మల్లెలన్
సొగసెందున్నను తేట తెల్లనగు నే సొంపైన నీవే యనం
దుగ గౌరీ ప్రియ తెల్లనైన సొగసున్ దోరంపు నీ జూపులన్
సిగ జాబిల్లి వెలుంగు నిన్ను గనెదన్ శ్రీ నీలకంఠేశ్వరా! (82)

మరునిన్ గెల్చిన వీరు డెవ్వరవనిన్ మాయావులన్ జంపుచున్
సురులన్ బ్రోచుచు రావాణాది యసురుల్ స్తోత్రంబులన్ బ్రార్ధనల్
పరిపాకంబగు భక్తి తోడ సలపన్ పాడిన్ కృపన్ జేయు చున్
సిరులీయు దయా మతీపె వరదా శ్రీ నీలకంఠేశ్వరా! (83)

మరునిన్ గెల్చిన శూరుడెవ్వరవనిన్?! మాయా ప్రపంచంబులో
తరువున్ గానక చిక్కుకొంచు మునులున్ తాపంబు నోర్వంగ వా
రిరుపై నట్టి శివానురక్తి సెదలన్ రిక్కించి నొందేరు; వా
రెరుకన్ బొందిన నీ కృపల్ గలుగుటే శ్రీ నీలకంఠేశ్వరా! (84)

తనవారెవ్వరు జూడ సెవ్వరు పరుల్ తానందరిన్ త్రాహి య
న్నను రక్షించు విభుండు బేధముల సేనాడున్ గనండయ్య త
న్ననురక్తిన్ మది నిల్ప రావణునకానాడాత్మ లింగంబు ని
చ్చె నపారంబగు భక్తి మెచ్చియెకదా శ్రీ నీలకంఠేశ్వరా! (85)

చిక్కున్ శ్లేష్మమునందు నీగవలె నే జిక్కంగ బంధంబులన్
ముక్కంటన్ గన ముజ్జగంబులనునీ మోదంబుగన్ లీలగన్
దిక్కంటిన్ నను గావుమా గరుణనుద్దీపింపు నా డెందమున్
జిక్కంగాకను జిక్కనింక భవమున్ శ్రీ నీలకంఠేశ్వరా! (86)

మున్నే నాడున బుట్టె బీజమిదియే మొక్కైన దీనాడు నే
వన్నెన్ దీనిని బెంతువో సుమములన్ బంగారు పత్రంబులన్
మిన్నైనట్టి ఫలంబులీను సొగసా మేలైన పద్యంబులన్
చిన్నీపోప వనంబునందు నధిపా శ్రీ నీలకంఠేశ్వరా! (87)

కొనసాగంగను భక్తి సాధనములన్ గోమైన చిత్తంబునన్
వినసొంపౌ పలు పద్యముల్ హృదయమున్ వీనుల్ వికాసంబులై
పెను పాపంబులు భస్మమొందు నటులన్ పెంపొంద గా వ్రాయుదున్
చెనకన్ కామపు వాసనల్ కృప గనో శ్రీ నీలకంఠేశ్వరా! (88)

భవ పాదంబుల జేర్చు పద్యమదియే పద్యంబగున్ గీతముల్
శివ కీర్తిన్ దెలియంగ జేయు నవియే; శ్రీ పాద సేవారతిన్
నవనీతంబగు చిత్తమందు మెదిలే నాదంబు నోంకారమై
శివ పంచాక్షరి గూడి వెల్గు నవనిన్ శ్రీ నీలకంఠేశ్వరా! (89)

రమణీయంబగు భావమేది దలపన్ రంజించు చిత్తంబులన్
కమనీయంబగు పల్కులేవి మది నాకర్షించు నెవ్వేళలన్
నమకంబుల్ చమకంబులున్ శివము నీ నామంబులన్ విన్నచో
గ్రిమికైనన్ నరు కైన ముక్తి కలుగున్ శ్రీ నీలకంఠేశ్వరా! (90)

పెక్కేండ్లీ పరితాప వహ్ని చెలగన్ పేరాశ ముంచెత్తగన్
చొక్కంబై వెలుగొందు నీదు పదముల్ చూరంగ లేకుంటి నీ
నిక్కంబైన విరాట్స్వరూపమది నే నిత్యంబు భావించినన్
చిక్కేమున్నది నేడు సత్యమరయన్ శ్రీ నీలకంఠేశ్వరా! (91)

పెంజీకట్లను దొల్గ దోయు నొకటే పేర్కొన్న నీ నామమే
గంజైనన్ గడు బ్రీతి త్రావ గలుగన్ గాఢంబునౌ భక్తి చే
రంజిల్లంగ వలెన్ మనంబున వికారారాతి నీ నాదమే
సింజిల్లన్ మది మువ్వయై ముదమునన్ శ్రీనీలకంఠేశ్వరా! (92)

మధువున్ గ్రోలెడు తేనెటీగ వలెనే మందాకినీ శేఖరున్
బుధ వర్గంబులు జేరి గొల్తురెపుడున్ బోధానురక్తిన్ సదా
విధుమౌళిన్ హృదయంబు నిల్పి విషయా వేశంబులన్ వీడుచున్
రిధమంబన్నను నీదు సేవలవియే శ్రీ నీలకంఠేశ్వరా! (93)

నేమంబున్ విడకుండనెప్పుడు మదిన్ నీ నామమున్ దల్చినన్
కామంబుల్ కడతేరకుండ గలవే కామారి నీ తోడుతన్
కామ క్రోధ వికారముల్ దొలగి నిక్కంబైన సద్భక్తులున్
సేమంబుల్ గలుగన్ వసింపు మదిలో శ్రీ నీలకంఠేశ్వరా! (94)

అసమాన్యంబగు రూపమున్ బహు దురూహ్యాహార్యమున్ చిత్రమౌ
వసనంబై కరి చర్మమొప్పు నహి యావాసంబుగా గాత్రమున్
బసవుండయ్యెను వాహనంబు భసితాభాసంబు నీ దేహమున్
సిసలైనట్టి పరీక్ష భక్తులకు నో శ్రీ నీలకంఠేశ్వరా! (95)

భుజగంబచ్చటె బర్హియుండునచటే పొందైన స్నేహంబునన్
గజశీర్షుండును సిమ్హమున్ నెరపరే గాఢంబు నెయ్యంబులన్
నిజవైరంబును మర్చియుండెనెటులో నెమ్మిన్ దలంపంగ న
ద్రిజ నాథాయిది నీ మహాత్మ్యమె గనన్ శ్రీ నీలకంఠేశ్వరా! (96)

మోదంబైనను ఖేదమైననది సమ్మోదంబు గాగైకొనన్
వేదంబంతయు నేర్చినంత గలుగే?! వేదాంత విజ్ఞానమున్
నీ దర్బారున వెల్గునెప్పుడరయన్ నీ రూపమై సత్యమున్
జేదివ్వెల్ వెలుఁగీయఁ జేయుమయ యో శ్రీ నీలకంఠేశ్వరా! (97)

శీతాద్రిన్ గొలువుండి శీతలమునౌ శీవంబు గ్రీవంబునన్
శీతాంశున్ మకుటంబుగా గొనుచు నా శీతంబు నీ గొప్పునన్
శీతాద్రీశ్వరు ముద్దు పట్టియును నీ చెంతన్ వసింపంగ నిన్
శీతాపంబుల నేల ముంచెదరయా? శ్రీ నీలకంఠేశ్వరా! (98)

గురుభావంబున నిన్ను దల్చినను నిన్ గొల్వంగ నే పాటినో
పరదైవంబని నిన్ను దల్చినను నీ పాదంబులందంగ నే
కుఱుచైతిన్ గద నిన్ను దల్చుటెటులన్ కోటీశ్వరా నీకు నే
సిరులేమీయగ లేను భక్తి దలుతున్ శ్రీ నీలకంఠేశ్వరా! (99)

దయ ధౌతాచలమౌను శౌచ శమముల్ దానంబు తో గంగయౌ
నయ ధర్మంబది నంది వాహనము తానానందమౌ శక్తియున్
లయ తాళంబుల తోడ తాండవమునన్ లాస్యంబుగా నొప్పినన్
శ్రియమై సత్యము సుందరంబు శివుడౌ శ్రీ నీలకంఠేశ్వరా! (100)

పలు తాపంబుల నోర్చు నీదు గుణమున్ భావింప భూమాత తా
ఖలులన్ సైతము నోర్చు భంగి విషమున్ కంఠంబునందుంచుటన్
దలపంగా నది పృధ్వి తత్వమె యగు మా తాపంబులన్ బాప నీ
చెలిమిన్ గోరెద పృధ్వి లింగమనుచున్ శ్రీ నీలకంఠేశ్వరా! (101)

దరిగానన్ నిను జేర నేర్వనధమున్ తచ్చాడుచున్ మాయలన్
కరి జిక్కన్ ముని గ్రాహ దంష్ట్రలను చక్రాఘాతమున్ గూల్చడే
హరి; నీవట్లెను శూలమున్ దునుమి మాయన్ బాపుమయ్యా శివా
చిరకాలంబును నిన్నె దల్తుననఘా శ్రీ నీలకంఠేశ్వరా! (102)

భవపాదాంబుజ రేణుపై మెసలుచున్ భావింతు నానందమున్
శివశక్త్యైక్య నిధానమంచు దెలియన్ చింతింతు నెల్లప్పుడున్
శివగౌరీ సమవేతమైన యనిశున్ చిద్రూప సంభావనన్
శివమే లోకము నెల్లెడన్ గనుదు నో శ్రీ నీలకంఠేశ్వరా! (103)

సుఖమే సంపద లీయగల్గు నవియున్ శోషించవే కాలమున్
నఖమున్ మాంపడు బ్రహ్మ మస్తకము దానట్లే సుఖంబున్ గదా
సుఖమేపారగ బొందు వాంఛ లుడగన్ శుభ్రాతిరిక్తంబునౌ
శిఖినేత్రా నినె దల్తు పొంద శుభముల్ శ్రీ నీలకంఠేశ్వరా! (104)

అపవర్గంబులు నాకలోకములయందాపేక్షతో నిన్ను నే
నెపుడున్ గొల్వను పాపభీతిగొని నేనే వేళలంగోర నో
త్రిపురారీ! నరకంబునన్ బడిన దారిద్ర్యంబులేముంచినన్
శిపివిష్టున్ స్మరణంబె చాలు ననెదన్ శ్రీ నీలకంఠేశ్వరా! (105)

త్రైమూర్త్యాత్మక విశ్వ వందిత హరా త్ర్యక్షా పరేశా నమో
సోమార్కానల నేత్ర దివ్య గుణ సంశోభాయమానా నమో
కామక్రోధ వినాశకా భవ ఓంకారస్వరూపా నమో
శ్రీమాతార్చిత పాద పద్మ యుగళా శ్రీ నీలకంఠేశ్వరా! (106)

దయ నీ నైజము గాగ నోర్మియగునీ ధర్మంబు వాత్సల్యతన్

భయమున్ బాపుచు భద్రమూర్తివగుచున్ ప్రాప్తించు దుఃఖంబులన్

నియతిన్ ద్రోలుచు నెప్డు తల్లి వలెనే నీకెంత కారుణ్యమో

శ్రియమున్ శాంతిని కల్గ జేయుదువు యో శ్రీ నీలకంఠేశ్వరా! (107)

మృగ శీర్షంబున యార్ద్ర యుక్త దినమున్ హృద్యంబుగా పూజలన్

సుగతిన్ జేయగ నెంతునయ్య దయతో శుభ్రాంతరంగంబునన్

విగతాఘంబగు చిత్తమున్ కృపను గావింపంగ బ్రార్థింతు నిన్

సెగకంటీ కృప జూడుమయ్య నను యో శ్రీ నీలకంఠేశ్వరా! (108)

కృతజ్ఞతలు

--------------------------------------------------

పద్యము వ్రాయుట సులభము కాదు.పద్యము అంటే లాక్షణికమైనది. యతి,ప్రాసలు,సరిగ్గా చూసుకుంటూ,నియతితో భావమును స్పష్టముగ వ్యక్తీకరిస్తూ,పద్యమును యే ఛందస్సులో వ్రాశామో,దాని లయ,కాపాడుకుంటూ,పద్యము యొక్క సౌందర్యము నినుమడించేలా వ్రాయటము నిజానికి కత్తి మీద సామే!.

నా వంటి వాడికి పద్యము వ్రాయటము అంతో యింతో అబ్బింది అంటే యిది కేవలము గురు కృప,అమ్మ వారి ఆశీస్సులు,ఛందోబద్ధమైన కవిత్వం వ్రాయటానికి స్ఫూర్తి కలిగించిన మా బాబాయి గారు (శ్రీ కొరుప్రోలు రాధా కృష్ణా రావు గారు) అని చెప్పటము యే మాత్రము నతిశయోక్తి కాదు.

కాళిదాసు కవితా పటుత్వానికి,కాళీ మాత కృప గురించి కథలలో వినటమే కానీ దాని గురించి ప్రత్యక్ష నిదర్శనములు లేవు. కానీ, నా విషయములో, తొలి నాళ్ళలో నేను పద్య కవిత్వం వ్రాద్దాము అని చేసిన చాలా ప్రయత్నాలు,యెలా విఫలమైనాయో, నేను వ్రాసి కొట్టేసుకుంటూ,మళ్ళీ వ్రాసుకుంటు అలానే యుంచేసిన చాలా పద్యములు గల నా చిత్తు పుస్తకమే సాక్షము.మా గురుదేవులు శ్రీ పి.వి.జి.కె. మూర్తి (ఫిజిక్స్ లెక్చరర్ హిందూ కాలేజి,గుంటూరు) గారు, కొన్ని యితర ప్రాసంగిక విషయాలు చర్చిస్తూ నన్ను గుంటూరులో శ్రీ సిద్దేశ్వరానంద భారతీ(పూర్వాశ్రమములో శ్రీ ప్రసాదరాయ కులపతి గారు, హిందూ కాలేజీ అధ్యాపకులు,సంస్కృతాంధ్ర పండితులు), గారిని కలవమని సూచించటం జరిగింది. వారు నెలకొల్పిన కాళీ ఆశ్రమమును సందర్శించిన తరువాత,యచ్చట అమ్మవారిని చూసాక కలిగిన యనిర్వచనీయమైన యనుభూతి, మరియు ప్రేరణ చేత సరాసరి,యింటికి కూడా వెళ్ళకుండా బుక్ ఎగ్జిబిషంకు వెళ్ళీ సులక్షణ సారము,శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యము కొనుక్కోని రావటం జరిగింది. అప్పటినుండి పద్య రచనాభ్యాసము మొదలయ్యింది. నేనూ వ్రాసిన పద్యములను తప్పో,యొప్పో ధైర్యముగా ఫేస్బుక్ లో పోస్ట్ చెయ్యటం మొదలుపెట్టాను. కొంత మంది

పండితులు ఫేస్బుక్ ద్వారా పరిచయమయ్యారు.శ్రీ జె.కె.మోహన రావు గారు,యింకా,శ్రీ ఏల్చూరి వారు యిలాగ యెందరో మహానుభావులు,అందరికీ వందనములు. శ్రీ ఏల్చూరి మురళీధర రావు గారు శంకరాభరణము అనే బ్లోగ్ ని పరిచయము చేసారు. వారి సూచనననుసరించి శంకరాభరణం బ్లోగ్ లో సమస్యా పూరణం అలవాటయ్యింది. కీ.శే శ్రీ పండిత నేమాని వారు, శ్రీ కంది శంకరయ్య గారు అందించిన విజ్ఞానము,ప్రోత్సాహము వలన కొంత నేర్చుకున్నాను. శ్రీ జె.కె. మోహనరావు గారు నా పద్యములను పరిశీలిస్తూ తప్పొప్పులను తెలియ చెబుతూ నాకు పద్య రచన చేయటానికి కావల్సినంత ధైర్యమును,యుత్సాహమును యిచ్చారు.

ఛందో సమూహములో సభ్యుడినైన తరువాత,శ్రీ నీలకంఠేశ్వర స్వామి ప్రేరణ తో మొదలుపెట్టిన శతకమును స్వామి వారి యనుగ్రహముతో,యింకా,చందో సమూహములోని గురు బృందము,శ్రీ జె.కె మోహన రావు గారు,శ్రీ పంతుల గోపాల కృష్ణా రావు గారు,శ్రీ గణపతి గారు,సంకిస భరద్వాజ శంకర్ గారు,బియెస్యెస్ గారు,పట్వర్ధన్ గారు,శ్రీ డొక్కా రాము గారు,యింకా యెందరో నన్ను ప్రోత్సహించారు.

ముఖ్యముగా శ్రీ జె.కె మోహనరావు గారు,నా పాలిట అమ్మవారి ప్రతి రూపమే యనుటలో యావగింజంతైనా సందేహము లేదు. ఇంతమంది సరస్వతీ పుత్రుల అండ దండ దొరకటం ,యింకా శ్రీ రామ కృష్ణ గారు వారి తండ్రి గారు వ్రాసిన స్వర్ణ నాగేశ్వర శతకమును పరిచయము చేయతము,అలాగే శ్రీ బియెసెస్ గారు వారి తండ్రి గారు రచించిన "నివేదన","గంగావతరణము",కావ్యములను,ప్రోత్సాహము గా నాకివ్వటం నాలో కవితా స్ఫూర్తిని పెంచటం నిజంగా నా యదృష్టము. పూర్వ జన్మ సుకృతము,మీ యందరిలో నెలకొని యున్న అమ్మవారి చల్లని చూపులు నాపై కురియుట వలనే నేను శ్రీ నీలకంఠేశ్వర శతకమును వ్రాయ గలుగుటకు కారణము.

అమ్మ వారి అనుగ్రహము, శ్రీ నీలకంఠేశ్వర స్వామి యనుగ్రహము మన అందరిపైనా యెప్పుడూ వుండాలని ఆ యాది దంపతులను,శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కోరుకుంటాను. అందరికి,శత సహస్ర కృతజ్ఞతాభివందనములను సమర్పించుకుంటూ

భవదీయ విధేయుడు

మద్దాలి శ్రీనివాస్.